ప్రజాశక్తి
శుక్రవారం 2 జూన్ 2023
5
అనంతపురం

అనంత టౌన్‌ప్లానింగ్ ఖాళీ

ఇద్దరు ఏసీపీలు బదిలీ - సిబ్బంది కొరతతో సమస్యలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యథేచ్ఛగా ఆక్రమణలు, అక్రమ కట్టడాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయని పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి తరుణంలో మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బందిని పెంచి అక్రమ కట్టడాలపై నిరంతర పర్యవేక్షణ చేయించాల్సి ఉంది. ఇలాంటి ముఖ్యమైన శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రస్తుతం టౌన్‌ప్లానింగ్‌లో ఇద్దరు అసిస్టెంట్ సిటీ ప్లానర్లను ఒకేసారి బదిలీ చేశారు. వీరిలో ఎసిపి శ్రీనివాసులు గత రెండు నెలలుగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఏసీబీ సువర్ణ రెగ్యులర్ పోస్టింగ్ ప్రొద్దుటూరు మున్సిపాలిటీ కాగా, ఆఫీస్ ఆన్ డ్యూటీ బేసిస్ మీద కొన్ని నెలలుగా అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక సెలవుపై ఉన్న శ్రీనివాసులు తిరిగి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఏడాది క్రితం శ్రీనివాసులు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నుంచే అనంతపురం కార్పొరేషన్‌కు బదిలీపై వచ్చారు. తొలుత కమిషనర్ భాగ్యలక్ష్మి శ్రీనివాసులు గత ఉద్యోగ పనితీరును పరిశీలించి విధుల్లో చేర్చుకోవటానికి విముఖత చూపారు. తదనంతరం రాజకీయ ఒత్తిళ్ల మేరకు ఎసిపి శ్రీనివాసులును మున్సిపల్ కార్పొరేషన్‌లో చేర్చుకోక తప్పలేదు. సదరు అధికారి అనంతపురం టౌన్ ప్లానింగ్ విభాగంలోకి రాగానే ఆ శాఖలో పెద్దఎత్తున అవినీతి జరిగిందనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. ఏసీబీ సువర్ణ సైతం విభాగ పరిపాలన కన్నా ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ విధులను గాలికి వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. ఇదే విషయంపై ఉన్నతాధికారుల మందలింపులకు సైతం ఆమె గురైనట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కార్పొరేషన్ నుంచి టౌన్ ప్లానింగ్ విభాగంలో అరకొరగా ఉన్న సిబ్బందికి తోడు ఉన్నవారిని సైతం బదిలీ చేయడంతో ప్రస్తుతం టౌన్‌ప్లాన్ విభాగం మొత్తం ఖాళీ అయినట్లు అయ్యింది. ఇద్దరు ఎసిపిల స్థానంలో కొత్త వారెవరినీ ఇక్కడికి బదిలీ చేయకున్నా, ఉత్తర్వులు అందుకున్న వెంటనే గురువారం నాడు ఏసీపీ సువర్ణను రిలీవ్ చేశారు. ఇటీవలే బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ మురళీకష్ణకు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగోన్నతి లభించడంతో రెండు రోజుల క్రితం కమిషనర్ రిలీవింగ్ ఆర్డర్స్‌ను జారీ చేశారు. ప్రస్తుతం అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఒక టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, ఒక బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ మాత్రమే మిగిలారు. సాధారణంగా కార్పొరేషన్‌లో ఆరుగురు బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, ఇద్దరు టీపీఎస్‌లు, ఒక టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్, ఇద్దరు ఏజీపీలు, ఏసీపీలు పనిచేయాల్సి ఉంది. ఇంత మంది ఉండాల్సిన చోట ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఆ శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది తగ్గిపోవడంతో పట్టణంలో అక్రమ కట్టాలు, ఆక్రమణలపై దృష్టి సారించడం ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు దీనిపై స్పందించి అనంత కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

బాభౌయ్..!

- రోడ్లపై పెరుగుతున్న కుక్కల దాడులు
- ద్విచక్రవాహనాల వెంట పరుగులు
- భయపడి కిందపడుతున్న వాహనదారులు
- ఉమ్మడి జిల్లాలో శునకాల స్వైర విహారం

"రెండు రోజుల క్రితం అనంతపురం నగరంలో ఓ ప్రయివేటు ఉద్యోగి విధులు ముగించుకుని రాత్రి పది గంటల సమయంలో ఇంటికి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. హౌసింగ్ బోర్డు సర్కిల్ వద్దకు రాగానే గుంపుగా ఉన్న కుక్కలు అతని వాహనాన్ని వెంబడించాయి. దీంతో ఆయన భయపడి వేగంగా వాహనం నడపడంతో అదుపు కిందపడ్డాడు. దీంతో ఆయన గాయపడ్డాడు".

"శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో బుధవారం నాడు ఓ బాలికపై కుక్కలు భౌతికదాడి చేసి గాయపర్చాయి. కేశవనగర్‌కు చెందిన పదేళ్ల బాలిక తినుబండారులు తెచ్చుకునేందుకు ఇంటి వద్ద ఉన్న అంగడికి వెళ్తుండగా మూడు కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో బాలికకు రక్తగాయాలు అయ్యాయి. స్థానికులు స్పందించి కుక్కలను అడ్డుకోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఇదే వీధిలో వారం రోజుల క్రితం ఓ వృద్ధుడిపై కూడా కుక్కలు దాడి చేసి గాయపర్చాయి".

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల ప్రజలపై కుక్కల దాడులు అధికం అయ్యాయి. గుంపులుగుంపులుగా రోట్లపైకి వచ్చే శునకాలు జనంపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. పట్టణం పల్లె అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఇటీవల కుక్కలదాడిలో గాయపడి ఆసుపత్రికి వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంటోంది. అనంతపురం లాంటి ప్రాంతాల్లో ప్రతి రోజూ 10 మందికి పైగా కుక్కకాటుకు గురవు తున్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే రోడ్డుపై ఉన్న కుక్కల గుంపును చూసి ఆ వీధుల్లోకి వెళ్లేందుకు జనం భయపడు తున్నారు. ఇటీవల కాలంలో శునకాలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయక పోవడంతో వాటి సంఖ్య విపరీతంగా పెరిగింది. గత నాలుగేళ్ల క్రితం వీధుల్లో కుక్కల నియంత్రణకు సంబంధిత మున్సిపల్,కార్పొరేషన్ అధికారులు సంతన నియంత్రణ ఆపరేషన్లు చేశారు. దాని వల్ల అప్పట్లో వాటి సంఖ్య కాస్త తగ్గింది. మళ్లీ అలాంటి కార్యక్రమం చేపట్టకపోవడంతో కుక్కల సంఖ్య పెరిగింది. ఇవి వీధుల్లోనే ఉండడంతో వచ్చిపోయే వారిపై దాడికి పాల్పడుతున్నాయి. ప్రతి ఏడాది కుక్కల నియంత్రణ ఆపరేషన్లు చేయించాలనే నిబంధన ఉన్నా అది ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు.

ధర్మవరంలో కుక్కకాటుకు గురైన చిన్నారి

వాహనదారులపై దాడులు

కుక్కల దాడిలో అత్యంత ప్రమాదకరంగా వాహనదారులపై చేసే దాడులు కన్పిస్తున్నాయి. వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనాల వెంట కుక్కల గుంపు వెంటపడుతోంది. వాహనం వెళ్లే వేగానికి సమానంగా కుక్కలు పరిగెడుతున్నాయి. దీంతో వాహదారుడు తీవ్ర భయాందోళనకు గురై వేగంగా వెళ్లి కిందపడడం లేదా కుక్కకాటుకు గురవడం లాంటి ఘటనలు అధికంగా జరుగుతున్నాయి. భార్యాభర్తలు వెళ్తున్న సమయంలో అయితే వెనుక కూర్చొన్న మహిళల చీరలు లాగి కిందపేడేలా చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులపైన కూడా వీటి దాడులు అధికంగా ఉంటున్నాయి.

ప్రాణాంతకంగా మారుతున్న రేబిస్

కుక్క కాటుకు గురైన వారు ప్రాణాంతక రేబిస్ వ్యాధికి గురయ్యే ప్రమాదం ఉంది. కుక్క కరిచినప్పుడు దాని లాలాజలం మనిషి శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఇది ప్రాణాంతక రేబిస్ వ్యాధికి సోకేందుకు కారణం అవుతోంది. ఇది నాడీ వ్యవస్థద్వారా మెదడుకు చేరి ప్రాణాంతకంగా మారుతోంది. కుక్కలు కరిచిన 2, 3 నెలలు లేదా 10 నెలల తరువాత కొందరిలో రేబిస్ లక్షణాలు బయటపడుతున్నాయి. శరీరంలో కుక్కపరిచే ప్రాంతాన్ని బట్టి వైరస్ సోకే ప్రమాదం ఉంటుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. కుక్క కరిచిన వెంటనే తప్పనిసరిగా రేబిస్ ఇంజెక్షన్లు వేయించుకోవాలి. లేకుంటే అతి ప్రాణాంతకం అయ్యే ప్రమాదం ఉంది. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరానికి సరపడా రేబిస్ ఇంజక్షన్లు లేనట్లు తెలుస్తోంది. రేబిస్ ఇంజెక్షన్లు ఖరీదు ఎక్కువగా ఉండడంతో ప్రయివేటుగా దీనిని కొనుగోలు చేసి వేయించుకునేందుకు పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కుక్కలను నియంత్రించాలి

ఇటీవల కుక్కల దాడులు అధికం అయ్యాయి. రోడ్లపై కుక్కలు స్వైర విహానం చేస్తున్నాయి. వారం రోజులుగా క్రితం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా కుక్కలు వెంటపడ్డాయి. దీంతో తీవ్ర భయాందోళనకు గురయ్యాను. కార్పొరేషన్ అధికారులు వీటిపై స్పందించాలి. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాసుపత్రిలో అవసరమైనన్ని రేబిస్ ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచాలి.

డి.అశ్వర్థనారాయణ, అనంతపురం.

రైతు భరోసా పంట నష్టపరిహారం మెగా చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

రైతుకు అండగా ప్రభుత్వం

పెట్టుబడి సాయాన్ని సద్వినియోగం చేసుకోండి
రైతు భరోసాసాయం పంపిణీలో కలెక్టర్, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పంట సాగు కోసం రైతులు ఎలాంటి ఇబ్బందులూ పడకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా సాయాన్ని అందిస్తోందని ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. 5 ఏడాది పిఎం కిసాన్, రైతు భరోసా సాయం జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నాడు బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కింద 2,89,116 మంది రైతులకు రూ.216.83 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన 5,311 మంది రైతులకు రూ.8.35 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని అందించినట్లు చెప్పారు. రైతులు ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతు భరోసా, పంట నష్టపరిహారం మెగా చెక్కులను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కుషాల్ జైన్‌తో పాటు ప్రజాప్రతినిధులు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భార్య బంగారు గొలుసును మింగేశాడు..!

మూడు నెలలు పాటు కడుపులోనే చైన్
ధర్మవరంలో ఘటన

ప్రజాశక్తి-అనంతపురం

భార్య బంగారు లాంగ్ చైన్‌ను భర్త మింగేశాడు. అతను దానిని మింగినట్లు అతనికే తెలియని పరిస్థితి. దాదాపు మూడు నెలల పాటు అది కడుపులోనే ఉంది. గత కొంతకాలంగా ఆయన అస్వస్థకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ స్కానింగ్ చేయించగా కడుపులో బంగారు చైన్ ఉన్నట్లు గుర్తించారు. అనంతపురం వైద్యులు అతనికి ఎలాంటి శస్త్ర చికిత్సలు చేయకుండానే నోటిద్వారా చైన్‌ను బయటకు తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ధర్మవరం పట్టణం రాజేంద్ర నగర్‌కు చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి తన భార్యకు చెందిన చైన్‌ను మింగేశాడు. ఎందుకు.. ఎప్పుడు దానిని మింగేశాడన్న విషయం ఆయనకు తెలియదు. కడుపులో చైన్ ఉండడంతో తీవ్ర అనారోగ్యానికి గురై చివరకు మాటలాడలేని స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇటీవల ఆయన్ను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు స్కానింగ్ చేసి కడుపులోకి గొలుసు ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ చేసి దానిని బయటకు తీయాలని చెప్పారు. ఆపరేషన్‌కు డబ్బులు ఖర్చు చేయలేని బాధితులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు సుకుమర్ ఎలాంటి చిన్న కుట్టుకూడా లేకుండా ఆ గొలుసును బయటకు తీశారు. ప్రస్తుతం బాధితుని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మున్సిపల్ కార్మికులపై నిర్లక్ష్యం

మున్సిపల్ కార్మికుల జాతాలో పాల్గొని మద్దతు తెలుపుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

- ప్రభుత్వం మొద్దు నిద్రవీడాలి
- స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు
- ఏపీ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.నాగభూషణం

ప్రజాశక్తి-గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు

పట్టణ ప్రజలకు అనేక రూపాల్లో సేవలు అందిస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఏపీ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.నాగభూషణం విమర్శించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హిందూపురం నుంచి ప్రారంభించిన రాష్ట్ర స్థాయి జీపుజాతా శుక్రవారం నాడు గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు మున్సిపాల్టీల్లో కొనసాగింది. జాతాను ఆయా మున్సిపాల్టీలో మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్మికులు ర్యాలీలు చేపట్టారు. గుంతకల్లులో జరిగిన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ పొల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సభల్లో జి.నాగభూషణం తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు నష్టదాయకంగా ఉన్న ఆప్కోస్‌ను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. 010 ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. గుంతకల్లులో జరిగిన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు వారి ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజారోగ్యం కోసం నిరంతరం పని చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి వారి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభించడం సరికాదన్నారు. తక్షణం వీరి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే కార్మికుల పక్షాన పోరాటం సాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, ఉపాధ్యక్షులు ముత్యాలు, సభ్యులు లక్ష్మీనారాయణ, ఏటీఎం నాగరాజు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, రైతుసంఘం నాయకులు బి.రామకష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్ని, ఐద్వా మండల అధ్యక్షురాలు ఆర్ఎం.కవిత, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సాకే నాగరాజు, కసాపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

సివిల్ సప్లయ్ కమిషనర్ అరుణ్‌కుమార్

మొక్క నాటుతున్న సివిల్ సప్లయ్ కమిషనర్ అరుణ్‌కుమార్

గార్లదిన్నె : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సివిల్ సప్లయ్ కమిషనర్ అరుణ్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఇల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.. ఎన్ని తరగతి గదులు ఉన్నాని ప్రధానోపాధ్యాయినిని అడగ్గా 180 విద్యార్థులు ఉండగా, 18 తరగతి గదులు ఉన్నాయని వివరించారు. అనంతరం తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పున:ప్రారంభమయ్యే నాటికి మరుగుదొడ్లు వాడుకలో వచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. అలాగే త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను కూడా పెంచి నాణ్యమైన విద్యా బోధన చేయాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జెసి కేతన్‌గార్గె, డిఇఒ సాయిరామ్, తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ తేజోష్ణ, ఎంఇఒ తారా చంద్రానాయక్, వెలుగు ఎపిఎం శ్రీరాములు, ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విప్ 'కాపు' విఫలం

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంతో విప్ కాపు రామచంద్రారెడ్డి పూర్తిగా విపలమయ్యారని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని ఎల్‌బి నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విప్ కాపు కేవలం టిడిపి కార్యకర్తలను అణచివేయడానికి, భయ పెట్టడానికి మాత్రమే పని చేస్తున్నారన్నారు. గడప గడపకూ వెళ్లినప్పుడు ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కోరితే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించడం ఏంటని నిలదీశారు. కాపు రామచంద్రారెడ్డి ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. దీంతో పోలీసులను అడ్డు పెట్టుకుని సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బలరామిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి ధనుంజయ, నాయకులు వెంకటేశ్వర్లు, రాము, తిప్పేస్వామి, హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ములకలపెంటవాసులకు రక్తపరీక్షలు

డిఎంఅండ్‌హెచ్‌ఒ వీరబ్బాయి - కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పరామర్శ

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

ములకలపెంటలోని ప్రజలకు తర్వలో రక్తపరీక్షలు నిర్వహించడంతోపాటు కీడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని డిఎంఅండ్‌హెచ్‌ఒ వీరబ్బాయి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని ములకలపెంట గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులను డిఎంఅండ్‌హెచ్‌ఒ పరామర్శించారు. ఇందులో భాగంగా రోగం బారినపడ్డ వారికి అందిస్తున్న వైద్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత రోగుల సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి రావడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా నొప్పుల మాత్రలు మింగడం, అతిగా మద్యం తాగడం, బీపీ, షుగర్, తాగునీరు వల్ల ఎక్కువగా కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. కాగా త్వరలో గ్రామ ప్రజలందరికీ రక్త పరీక్షలు నిర్వహించి ఇంకా ఈ వ్యాధి బారిన పడ్డవారు ఉంటే సరైన చికిత్స అందించడంతోపాటు ఈ వ్యాధికి మూల కారణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. మెర్క్యూరియా, సిరం టెస్టుల రిపోర్టులు వచ్చిన తర్వాత వ్యాధి ఏ దశలో ఉందో పరిశీలించి అందుకు తగిన వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఒ చెన్నకేశవులు, మెడికల్ ఆఫీసర్ సాయి ప్రశాంత్, వైద్య సిబ్బంది త్యాగరాజు, వాణి సుజాత, హరినాథ్, రితిక, కుమారస్వామి, ఎం.సుధాకర్, సూర్యనారాయణ, ఆదిలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ వీరబ్బాయి

జగన్‌ను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర రైతులు, ప్రజలను మోసం చేసిన నయవంచకుడు సిఎం జగన్ జగన్‌ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా మొత్తాలను రైతుల ఖాతాలకు జమ చేసేందుకు బటన్ నొక్కే కార్యక్రమానికి రాయలసీమలోని కర్నూలుకు వచ్చిన సిఎం జగన్ సీమలో దుర్భిక్ష నివారణ పథకం గురించి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా హంద్రీనీవా, గాలేరు– నగరి ప్రణాళిక గురించి చెబుతారని ఆశపడ్డానన్నారు. సీమ సాగునీటి ప్రాజెక్టుల పూర్తి గురించి మాటమాత్రమైన ప్రస్తావించలేదన్నారు. జగన్ గతంలో రాయదుర్గం వచ్చినప్పుడు ఆరువారాల్లో 900 ఎకరాల భూసేకరణ చేసి బిటిపి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, ఉంతకల్లులో రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. సీమకు తీరని ద్రోహం చేసిన జగన్ మరోసారి ప్రజలను వంచించారన్నారు. ఇకపోతే ప్రతిపక్షాలను కూడా తులనోటం బాధాకరమన్నారు. ప్రతిపక్షాలను తిట్టేందుకు ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్నారు. గతంలో చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.21వేల కోట్ల సాయం, రూ.15,279 కోట్ల రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. రైతు భరోసా కంటే ముందే తమ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరిట రైతుకు రూ.15వేల చొప్పున సాయం 55 లక్షల మంది రైతులకు అందజేశామన్నారు. జగన్మోహన్ రెడ్డి 64 లక్షల మంది రైతులను ఆదుకుంటామని చెప్పి నేడు 52 లక్షల మందికి సాయం అందిస్తున్నారన్నారు. ఇచ్చిన సాయం కూడా రూ.13,500లో పిఎం కిసాన్ సాయం కింద రూ.7,500 ఇవ్వగా పూర్తి మొత్తాన్ని తామే ఇచ్చినట్లు బిల్డప్ ఇచ్చారన్నారు. అలాగే డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, అదనపు సాగునీరు ఎన్ని ఎకరాలకు అందజేశారని ప్రశ్నించారు. రైతులకు అడుగడుగునా మోసం చేసిన జగన్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, డి.హీరేహాల్ మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, రాయదుర్గం మండల కన్వీనర్ కె.హనుమంతు, చేనేత సహకార సంస్థ మాజీ డైరెక్టర్ టి.హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు తహశీల్దార్‌గా లక్ష్మానాయక్

పెద్దపప్పూరు : మండల తహశీల్దార్‌గా బి.లక్ష్మానాయక్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న షర్మిల ఆత్మకూరుకు బదిలీపై వెళ్లింది. దీంతో రాప్తాడు తహశీల్దార్‌గా పని చేస్తూ సెలవులో ఉన్న లక్ష్మానాయక్‌ను ఇక్కడిని నియమించారు. దీంతో స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా స్థానిక సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పుట్లూరు తహశీల్దార్‌గా మోహన్‌కుమార్

పుట్లూరు : మండల తహశీల్దార్‌గా మోహన్‌కుమార్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ సుమతిని యల్లనూరు మండలానికి బదిలీ చేశారు. దీంతో బుక్కరాయసముద్రం మండలంలో పని చేసే తహశీల్దార్ మోహన్‌కుమార్‌కు పుట్లూరుకి వచ్చారు.

ఘనంగా భోగలింగేశ్వరస్వామి కల్యాణం

హోమం చేస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండలం ఉండబండ గ్రామంలో వెలసిన గంగ పార్వతీ సమేత భోగలింగేశ్వరస్వామి కళ్యాణం గురువారం కన్నుల పండువగా సాగింది. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే భోగలింగేశ్వర స్వామి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు మహా రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా గోపుర కలశ ప్రతిష్టాపన నిర్వహించారు. తదుపరి కళ్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. తర్వాత హోమానికి మహా పూర్ణహారతి ఇచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్తూరు కల్లుహోలే మఠం పీఠాధిపతి చెన్న వీరశివాచార్యస్వామి, కొక్కరచేడు శరణమ్మ అవ్వ, గ్రామస్తులు శంకర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, గంగాధర్ స్వామి, రాజన్నగౌడ్, ఉమ మహేశ్వరస్వామి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డికి నివాళి

సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలో నూతనంగా ప్రారంభించిన బ్రిడ్జికి మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి పెట్టాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం నాయకులు డిమాండ్ చేశారు. నీలం సంజీవరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు గంగాలకుంట నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితోపాటు దేశానికి రాష్ట్రపతిగా నీలం సంజీవరెడ్డి అనేక సేవలు చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి నగరంలోని బ్రిడ్జికి నీలం పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి భయపరెడ్డి, జిల్లా అధ్యక్షులు రేనాటి నాగేశ్వరరెడ్డి, రైతు విభాగం ఉపాధ్యక్షులు సూర్యచంద్రారెడ్డి, యువజన విభాగం నాయకులు ఆదికేశవరెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

శింగనమల : మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ తరిమెల కోనారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నగరంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద నూతనంగా నిర్మించిన నాలుగు లైన్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జికి నీలం సంజీవరెడ్డి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ తరిమెల కోనారెడ్డి, వైకాపా నేతలు రమణ, వెన్నుపూస రామచంద్రారెడ్డి, నీలం అభిమానులు నీలకంఠేశ్వర, గురుమూర్తి, గొల్లారెడ్డి, తిరుపతయ్య, ఆదిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, దస్తగిరి, వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఉరవకొండ : ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ లోని పలు వార్డుల్లో చేపట్టిన పారిశుధ్య పనులను గ్రామపంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు కూడా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పిహెచ్‌సి తనిఖీ

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ వీరబ్బాయి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా కాన్పులు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, హై రిస్క్ కేసుల విషయంలో నర్సులు వెంటనే వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాసులురెడ్డి, శ్రీరామ్‌కుమార్, కడప శ్రీనివాసులు, వీరన్న తదితరులు ఉన్నారు.

ఎఐటియుసి నూతన కార్యవర్గం ఎన్నిక

గుత్తి : పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం ఎఐటియుసి అనుబంధ సంస్థ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడిగా ఆర్‌బి రామంజి, కార్యదర్శిగా ఎస్.నజీర్, ఉపాధ్యక్షుడిగా ఎస్.రజాక్‌వలి, సహాయ కార్యదర్శిగా కె.సురేష్, కోశాధికారులుగా ఎన్.సూరి, ఎర్రిస్వామి, గౌరవాధ్యక్షులు, సలహాదారులతోపాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలి



ఐసిడిఎస్ పీడీ శ్రీదేవికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బాల రామాంజనేయులు

ఉరవకొండ : నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మొలక బాల రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వజ్రకరూరు మండల కేంద్రంలో పర్యటనకు వచ్చిన ఐసిడిఎస్ పీడీ శ్రీదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారన్నారు. ఆయా భవనాల్లో కనీస వసతులు కూడా లేవన్నారు. కావున ప్రభుత్వం స్పందించి కనీస మౌలిక వసతులతో కూడిన భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు.

'ఎస్ఆర్ఐటి' యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్

ప్రజాశక్తి-శింగనమల

అనంతపురానికి కూతవేటు దూరంలో ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాలలో విద్యార్థుల ఫుడ్ పాయిజన్‌కు కారణమైన యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి భాగస్వామ్యంతో నడుస్తున్న ఎస్ఆర్ఐటి కళాశాలలో ఫుడ్ పాయిజన్ జరిగి దాదాపు 80 విద్యార్థులు ఆసుపత్రి పాలు కావడం బాధాకరమన్నారు. వారిద్దరూ తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేవలం డబ్బే లక్ష్యంగా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి విద్యాశాఖ సలహాదారుగా ఉన్న వ్యక్తి కళాశాలలోనే ఇలా జరిగితే ఇక రాష్ట్రంలోని కళాశాలల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అంతేగాకుండా కళాశాలలో కనీస మౌలిక వసతులు కూడా లేవన్నారు.

అయినా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఫుడ్‌ఫాయిజన్ అయిన విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి ప్రత్యేక చికిత్సల ఖర్చులను యాజమాన్యమే భరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఎస్ఆర్ఐటి కళాశాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గ్రంథాలయంలో 25వ రోజు సమ్మర్ క్యాంప్

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరం గురువారం 25వ రోజుకు చేరుకుంది. ఇందులో 69 మంది విద్యార్థులు హాజరై వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా యోగా, నృత్యం, స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తక పఠనం, హ్యాండ్ రైటింగ్ వంటి పరీక్షల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారిణి వి.సుబ్బరత్నమ్మ, ఇంతియాజ్ అహ్మద్, కావేరి, హేమమాలిని, ఉజ్జినేశ్వరి, రిసోర్స్‌పర్సన్ ఎం.వెంకటేశప్ప, లక్ష్మి, రాజేష్, జ్యోతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగా చేస్తున్న చిన్నారులు

జీవితంలో ఉద్యోగం ఒక భాగం

రైల్వేగార్డు మల్లన్న సన్మాన సభలో వక్తలు

రైల్వేగార్డు మల్లన్నను సన్మానిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-గుంతకల్లు

సహజంగా ఎవరైనా ఉద్యోగాన్ని జీవితంలో ఒక భాగంగా చూస్తారని, అయితే రైల్వేగార్డు మల్లన్న మాత్రం ఉద్యోగమే జీవితంగా బతికారని పలువురు వక్తలు కొనియాడారు. పదవీ విరమణ సందర్భంగా గురువారం స్థానిక రైల్వే జంక్షన్ స్టేషన్‌లో ఉన్న గార్డుల విడిది హాలులో మల్లన్నను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగులు, అధికారులు మాట్లాడుతూ ఒకప్పుడు రైలు రోడ్డు నిర్మాణానికి కంకర మోసి కష్టపడి ఎదిగి రైల్వేగార్డు స్థాయికి చేరుకున్న సి.మల్లన్న సేవలు మరువలేనివన్నారు. అంతేగాకుండా ఆయన జీవితం మొత్తం రైల్వే ప్రయాణీకుల భద్రత కోసం కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖాధికారులు, సహోద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌ను విమర్శించడం తగదు

విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

సిఎం జగన్మోహన్‌రెడ్డిని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించడం చూస్తుంటే సింహం ముందు పిచ్చికుక్క మొరిగినట్టుగా ఉందని విప్ కాపు రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. గతంలో రైతు రుణమాఫీ అంటూ రైతులను మోసం చేయడంతోనే టిడిపి పాలన ప్రారంభమై అంతమయ్యేంత వరకూ మోసాలతోనే పూర్తి చేశారన్నారు. రైతన్నలు బ్యాంకులో కుదువబెట్టిన బంగారం విడిపిస్తామని, రైతుల కోసం రూ.5వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని చెప్పి మోసం చేశారని గుర్తు చేశారు. అంతేగాక టిడిపి అధికారంలోకి వస్తే కరువు కాటకాలతో రైతులు తల్లడిల్లిపోతారన్నారు. అదే జగన్ అధికారంలోకి వచ్చాక వర్షాలు సకాలంలో కురిసి రైతులు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. టిడిపి నాయకులు ఆఖరికి వర్షాభావాన్ని కూడా అవకాశంగా మార్చుకుని రెయిన్‌గన్‌ల పేరుతో రూ.వందల కోట్లు దోచుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. చంద్రబాబు జీవితాంతం ప్రాజెక్టుల పేరుతో దోపిడీ చేయడం తప్ప ఎప్పుడూ ఏ ప్రాజెక్టునూ పూర్తి చేసిన పాపాన పోలేదన్నారు. అందుకే చంద్రబాబును ఇప్పటికీ 'నిన్ను నమ్మం బాబు' అంటున్నారన్నారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు కుళ్లు, కుతంత్ర రాజకీయ ప్రసంగాలు మానుకుని విశ్రాంతి తీసుకోవాలని హితవు పలికారు.

స్టోన్‌వ్యాలీ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

విలేకరులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్న పట్టణంలోని స్టోన్‌వ్యాలీ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ రాయదుర్గం తాలూకా అధ్యక్షులు అంజి, ఎఐవైఎఫ్ తాలూకా ప్రధాన కార్యదర్శి కొట్రేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని స్టోన్‌వ్యాలీ పాఠశాలలో అక్రమ అడ్మిషన్లకు పాల్పడటాన్ని నిరసిస్తూ స్థానిక పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల తనిఖీల్లో భాగంగా స్టోన్‌వ్యాలీ పాఠశాలను పరిశీలించగా అడ్మిషన్లకు పాల్పడుతుండటాన్ని గమనించి ప్రధానోపాధ్యాయులను అడగ్గా నిర్లక్ష్య సమాధానం ఇవ్వడం బాధాకరమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి స్టోన్‌వ్యాలీ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సరుకుల పంపిణీలో అలసత్వం వద్దు : ఆర్‌డిఒ

రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ నిషాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామ రేషన్‌షాపు(52)ను ఆర్‌డిఒ నిషాంత్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టాక్ రిజిస్ట్రర్‌ను పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న లబ్ధిదారులను రేషన్ పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరుకుల పంపిణీలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, ఎలాంటి ఫిర్యాదులు అందకుండా సరుకుల పంపిణీని పటిష్టంగా చేపట్టాలని డీలర్‌కు సూచించారు.

బందోబస్తు మధ్య సీసీ రోడ్డు నిర్మాణం

బందోబస్తు మధ్య రోడ్డు వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి ఆర్ఎస్‌లోని రోప్ మకాన్ నుంచి ప్రధాన రహదారి వరకు పోలీస్ బందోబస్తు మధ్య సీసీ రోడ్డును పూర్తి చేశారు. దాదాపు 33 అడుగుల రోడ్డు వేయాల్సి ఉంది. అయితే ఆక్రమణలతో 20 అడుగులు మాత్రమే ఉండడంతో మున్సిపల్ అధికారులు ఆక్రమణలను తొలగించేందుకు పూనుకున్నారు. దీంతో ఆక్రమణదారులు అధికారులను అడ్డుకున్నారు. చేసేదిలేక మున్సిపల్ అధికారులు పోలీసులను ఆశ్రయించడంతో ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని జెసిబి ద్వారా కొంతమేర ఆక్రమణలను తొలగించి సిసి రహదారి పనులను పూర్తి చేయించారు.

నేరాలు ఘోరాలు

నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న సిఐ హరినాథ్

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

ఉరవకొండ : పట్టణంలోని ఇందిరానగర్ 9వ వీధిలో మూడు రోజుల క్రితం జరిగిన దొంగతనం కేసును ఉరవకొండ పోలీసులు ఎట్టకేలకూ ఛేదించారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సిఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంతకల్లు పట్టణానికి చెందిన షికారు రాజుని ఉరవకొండ మార్కెట్ యార్డు వద్ద అదుపులోకి తీసుకుని 8 తులాల బంగారం, అర కిలో వెండిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అంతేగాకుండా ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన షికారి రాజు 11 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు వివరించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగలను గుర్తించామన్నారు. దొంగతనం కేసును మూడు రోజుల్లోనే ఛేదించిన పోలీసులను పలువురు అభినందించారు.

పట్టపగలు రూ.8 లక్షలు చోరీ

సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఉరవకొండ: ఉరవకొండలో గురువారం పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. దాదాపు రూ.8 లక్షలను దర్జాగా దోచుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..ఉరవకొండ మండలం వెలిగొండ గ్రామానికి చెందిన తలారి రామన్న గురువారం కెనరా బ్యాంకు నుంచి రూ.8 లక్షలు డ్రా చేసుకుని స్కూటర్ డిక్కీలో డబ్బును పెట్టి పట్టణంలోని రిజిస్టర్ కార్యాలయం వద్ద ఆపి టీ తాగుతుండగా డిక్కీని ఓపెన్ చేసిన దుండగులు అందులోని నగదును దోచుకెళ్లారు. రామన్న టీ తాగి వచ్చి స్కూటర్ స్టార్ట్ చేసేందుకు వెళ్లగా డిక్కీ తెరిచి ఉండటం గమనించి అవాక్కయ్యాడు. వెంటనే ఉరవకొండ పోలీసులకు సమాచారాన్ని అందించారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్, ఎస్ వెంకటస్వామి ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డబ్బులు దోచుకెళ్లిన దొంగల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కెనరా బ్యాంకులో సీసీ కెమెరాలు, రిజిస్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించారు.

పిడుగుపాటుకు గొర్రెలు మృతి

బెలుగుప్ప : మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కురుబ హనుమంతప్పకు చెందిన మూడు గొర్రెలు గురువారం మృతిచెందాయి. దీంతో సుమారు రూ.60వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. రోజూ మాదిరిగానే గొర్రెల మందను వెంకటాద్రిపల్లి–గంగవరం గ్రామాల వద్ద పొలాల్లోకి మేపేందుకు తీసుకెళ్లాడు. ఈనేపథ్యంలో సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడా వర్షం కురవడంతో పిడుగుపాటుకు గురై మూడు గొర్రెల మృతిచెందినట్లు తెలిపారు. ప్రభుత్వం సాయమందించి ఆదుకోవాలని కోరారు.

ఘుమ్మగట్ట : మండల పరిధిలోని దేవిరెడ్డిపల్లి గ్రామంలో గొల్ల పరమేశ్వరకు చెందిన పది గొర్రెలు పిడుగుపాటుకు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే.. పరమేశ్వర తన గొర్రెల మందను మేపుకుని సాయంత్రం ఇంటికి వస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో గొర్రెలన్నీ చెట్ల కిందకు వెళ్లాయి. ఆ సమయంలో పిడుగు పడటంతో 10 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయని పరమేశ్వర ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో దాదాపు రూ.1.20లక్షల నష్టం వాటిల్లినట్లు వాపోయాడు.

బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో మంగళ శ్రీరాములు ఇంటి ముందు ఉన్న కొబ్బరి చెట్టు గురువారం సాయంత్రం పిడుగుపాటుకు గురై కాలిపోయింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదమేమీ లేకుండా పోయింది.

మండల పరిధిలోని దేవిరెడ్డిపల్లి గ్రామంలో మృతిచెందిన గొర్రెపిల్లలు

రోడ్డు ప్రమాదంలో ఇన్‌ఛార్జి డిఇఒకు గాయాలు

రామగిరి : శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి డీఈఓ మీనాక్షి రామగిరి మండలం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలు తనిఖీల్లో భాగంగా గురువారం ఆమె ఎంఈఓ గోపాల్‌తో కలిసి రామగిరి మండలం వెళ్లారు. రామగిరి నుంచి తిరిగి వెళుతున్న సందర్భంలో ఆమె ప్రయాణిస్తున్న వాహనం రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలించారు.

ఇసుక డంప్ సీజ్

పలిగి : మండల పరిధిలోని జయమంగళ నది నుంచి అనుమతులు లేకుండా తరలించి ఒకచోట భారీగా ఇసుక డంప్ చేసినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేయడంతో గురువారం సెబ్ అధికారులు స్పందించారు. ఎటువంటి అనుమతులు లేకపోవడం, సుమారు 700 టిప్పర్ల ఇసుక ఒకే చోట నిల్వ చేయడంపై అటు గ్రామస్తులు, ఇటు మండలంలోని ప్రజాప్రతినిధులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సగటు వ్యక్తికి ఇసుక కావా లంటే ఎన్నో కారణాలు చెప్పే అధికారులు జేపీ కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం పనితీరుపై స్పందిం చకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ తరుణంలో డంపును పరిశీలించిన సెబ్ అధికారు లు జేపీ కన్‌స్ట్రక్షన్‌కు అనుకూలంగా ప్రవర్తించడం, కనీసం అనుమతులు కూడా చూడకపోవ డం అధికారుల పనితీరుకు నిదర్శనమని సిపిఎం మండల నాయకుడు నాగరాజు పేర్కొన్నా రు. రెండు నెలల నుంచి ఏకధాటిగా జయమంగళ నది నుంచి ఇసుక తరలిస్తున్నా అధికారు లు స్పందించకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అన్నారు. డంపు ఏర్పాటుపై సంబంధిత యాజమాన్యంపై అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే సిపిఎం తరపున తిరుగుబాటు మొదలవుతుందని హెచ్చరించారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్19) అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ బి.చంద్రమోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం జెన్‌టియు వెబ్ సైట్ http://jntuaresults.ac.in%ను సంప్రదించాలని కోరారు.

పురం అసిస్టెంట్ కమిషనర్‌గా రామ్‌భూపాల్ రెడ్డి

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘం అసిస్టెంట్ కమిషనర్‌గా రాంభూపాల్‌రెడ్డిని నియమిస్తూ గురువారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొన్ని నెలలుగా పురపాలక సంఘంలో అసిస్టెంట్ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. సాధారణ బదిలీల్లో భాగంగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న రాంభూపాల్‌రెడ్డిని హిందూపురం పురపాలక సంఘానికి నియమించారు.